ప్రజాశక్తి

బుధవారం మార్చి 8 2023 | 8 పేజీలు | శ్రీకాకుళం





'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- పరీక్షా కేంద్రాలు నో మొబైల్ జోన్
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 30 మండలాల్లో 149 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు 28,855 మంది రెగ్యులర్ అభ్యర్థులు, 720 ప్రయివేటు అభ్యర్థులు (మిగతా...2లో)

మహిళలు మహారాణులు

'స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే సృష్టే లేదు' అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

(మధ్యపేజీల్లో)

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకవుతా

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ
- ఉత్తరాంధ్రకు అన్యాయంపై ప్రశ్నించని వైసిపి, టిడిపి
- ప్రజా సమస్యలపై పోరాటానికి తనను గెలిపించాలని విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర గొంతుకనవుతానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విభజన హామీల్లో భాగంగా విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన, పెట్రోలియం యూనివర్సిటీ హామీలు అమలు కాలేదని, వీటిపై శాసనమండలిలో గొంతు వినిపిస్తానని ఆమె చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎనిమిదేళ్లలో ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్లు రావాల్సి ఉండగా, రూ.450 కోట్లే ఖర్చు పెట్టారని విమర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంతం వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధిపరంగా వెనుకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. సుజల స్రవంతి పూర్తయితే 8 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేదని అభిప్రాయపడ్డారు. ఆమదాలవలస షుగర్ పరిశ్రమతో సహా మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు వైసిపి ప్రభుత్వం కనీస ప్రయత్నించకపోగా, ఒక మంత్రి చిట్టివలస జూట్ యాజమాన్యానికి సహకరించారని చెప్పారు. ఉత్తరాంధ్రలో అతి పెద్దదైన నెల్లిమర్ల జూట్ మిల్లు కూడా మూతపడిందన్నారు. పారిశ్రామిక, రసాయనిక వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టడంతో మత్స్యసంపద దెబ్బతింటోందని చెప్పారు. ఉపాధి లేక మత్స్యకారులు వలసబాట పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్ర నెత్తిన అణు కుంపటి

ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్కేంద్రాన్ని ఉత్తరాంధ్ర (మిగతా...2లో)

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికలపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులు తప్పనిసరిగా పోలింగ్ పార్టీతో కలిసి వెళ్లాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. వెబ్ కాస్టింగ్ తదితర వాటిని అంతా సిద్ధం చేసినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తు, శాంతి భద్రతలు గూర్చి పరిశీలకులకు అడుగగా ఎస్‌పి జి.వి. రాధిక మాట్లాడుతూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు శ్యామలరావు

ఎన్నికల్లో శాంతి భద్రతలు, పోలీసు బందోబస్తు, చెక్ పోస్టులు, తదితర వాటిపై ఎన్నికల పరిశీలకులకు వివరించారు.

రౌడీషీటర్స్, ఎన్నికల నియమావళి, తదితర వాటిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డిఆర్డిఎ పిడి విద్యాసాగర్ నోడల్ ఆఫీసర్ ట్రైనింగ్ పిఒ, ఎపిఒలకు తిరిగి 9వ తేదీన శిక్షణ ఉంటుందని చెప్పారు. డిటిసి శ్రీదేవి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల మెటీరియల్ రవాణాకు సంబంధించి వివరించారు. హౌసింగ్ పిడి గణపతిరావు మాట్లాడుతూ వెబ్ కాస్టింగ్ కు సంబంధించి అన్నింటిని సిద్ధం చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల ఫెసిలిటీష్ను ఎవరు చూస్తున్నారని ఎలక్షన్ అబ్జర్వర్ శ్యామలరావు అడుగగా సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో లకు అప్పగించినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చెప్పారు. డిపిఒ రవి కుమార్ ఎలక్షన్ మెటీరియల్ గూర్చి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఆర్డీఓ బి. శాంతి, ఉప కలెక్టర్లు సవరమ్మ, మురళీకృష్ణ, డిఎస్పీ బాలరాజు, ఆర్టీసీ ఆర్ఎం విజయ్ కుమార్, డిపిఒ రవి కుమార్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మిగిలిన ధాన్యం కొనుగోలు

సిఎం జగన్ హామీనిచ్చారు : ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట



రైతుల దగ్గర మిగిలి ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేసి తీరుతుందని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ విషయమై తాను ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో మాట్లాడానని, ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు. నరసన్నపేటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన నేపథ్యంలో విపక్షాల బుద్ధి ఇకనైనా మార్చుకోవాలని సూచించారు. రాష్ట్ర విభజనతో ప్రధాన నగరమైన హైదరాబాద్‌ను కోల్పోయామని, ఆ నగరంతో పోటీ పడగలిగే స్థాయి ఒక్క విశాఖకు మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వం కొత్త పరిశ్రమలకు చాలా వేగంగా అనుమతులు ఇస్తోందని తెలిపారు. సులభతర వాణిజ్యంలో గత మూడేళ్లుగా నెంబర్ వన్‌గా ఉన్నామని గుర్తుచేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని వనరులు, మౌలిక వసతుల గురించి ప్రచారం చేయలేదన్నారు. జిల్లాలో భావనపాడు పోర్టు నిర్మాణం చేపడుతున్నామని, జెట్టీలు, తీరం వెంబడి పలు ప్రాజెక్టులకు రూపకల్పన జరుగుతోందన్నారు. వలసల నివారణకు ఇవి పూర్తిగా దోహదపడతాయన్నారు. తొలుత సమ్మిట్ విజయవంతం కావడంతో బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేశారు. సమావేశంలో వైసిపి బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి చైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపి, పతివాడ గిరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయండి

ఎన్నికల కమిషన్‌ను కోరిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో వైసిపి అధికార దుర్వినియోగానికి ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్నికోడ్ ఉల్లంఘనలపై పలుసార్లు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలి ఎన్నికల్లో వైసిపి బరితెగించి వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, వాలంటీర్ల వ్యవస్థను తమ అభ్యర్థి గెలుపు కోసం వాడుకుంటోందన్నారు. పలు సందర్భాల్లో వీటిపై జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం జీతాలు చెల్లించే వాలంటీర్ల వ్యవస్థను తన పార్టీ జేబు సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. దొంగ ఓట్లు చేర్పించడం, నామినేషన్‌కు ప్రజలను తరలించడం, పట్టభద్రులతో సమావేశాలు నిర్వహించడం వంటి పనులన్నింటికీ వీరిని వైసిపి వాడుకుంటోందన్నారు. ఇలా చేయడం అనుమతించరాదని తాము ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు



మాట్లాడుతున్న అజశర్మ

మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టరుకు ఈ నెల 2న ఆదేశాలిచ్చారన్నారు. అయినా అవేవీ ఆగడం లేదన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే తమ ఓటమి ఖాయమని తెలిసే వైసిపి ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తాము మంగళవారమూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్లు అజశర్మ వెల్లడించారు. విజ్ఞులైన ఉత్తరాంధ్ర పట్టభద్రులు అధికార పార్టీ ఉల్లంఘనలు, అడ్డదారులు, అక్రమాలను గుర్తెరిగి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నిజాయతీగా, నిబద్ధతగా, నిస్వార్థంగా పని చేస్తున్న 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకవుతా

ప్రాంతంపై రుద్దుతున్నారని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో అంబేద్కర్ యూనివర్సిటీ పేరుకు యూనివర్సిటీ అయినా, అందులో కనీస అధ్యాపక, సిబ్బంది లేరని చెప్పారు. ట్రిపుల్ ఐటి పరిస్థితీ అలాగే ఉందన్నారు. రిమ్స్, టెక్కలి ఏరియా ఆస్పత్రులతో సహా ఎక్కడా తగినంత మంది వైద్యులు, సిబ్బంది లేరని చెప్పారు. ఉద్దానం కిడ్నీ వ్యాధికి గల కారణాలను పరిశోధించే పరిశోధనా కేంద్రం నేటికీ కార్యరూపం దాల్చలేదని విమర్శించారు.

రాష్ట్రానికి బిజెపి అన్యాయం

రాష్ట్ర విభజన చట్టం, ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ, రైల్వేజోన్, మెట్రో రైలు, విద్యాసంస్థల నిర్మాణం వంటి అన్ని అంశాల్లోనూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయమే చేసిందన్నారు. రాష్ట్రానికి మేలు చేయకపోగా ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆ పని చేయలేదు సరికదా, పోటీ పడి కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్నాయని విమర్శించారు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్వ ప్రయోజనాలే తప్ప, ఉత్తరాంధ్ర అభివృద్ధి కనీసం పట్టడం లేదన్నారు. జిల్లాకు చెందిన ఓ సీనియర్ మంత్రి ఇంకో మెట్టు ముందుకెళ్లి స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని సమర్థించారని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన పట్టభద్రుల ఎన్నికల్లోనూ రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను పోటీకి పెట్టాయని చెప్పారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలిస్తే సహజంగానే వారి పార్టీ అజెండానే వారికి ప్రధానమవుతుంది తప్ప, ప్రజల ప్రయోజనాలు కాదని స్పష్టం చేశారు.



జి.సిగడాంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులతో కోరెడ్ల రమాప్రభ

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో అధికార దుర్వినియోగం

పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వం అనేక అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తున్న యువత మార్పు కోరుకుంటోందని, ఈ ఎన్నికల్లో పట్టభద్రులు తనను గెలిపిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, నిరుద్యోగ యువత, మహిళల వంటి పలు తరగతుల ప్రజా సమస్యలేవీ చట్టసభల్లో కనీసం ప్రస్తావనకు రావడం లేదని చెప్పారు. పిడిఎఫ్ తరుపున గెలిచిన ఎమ్మెల్సీలే నీతి, నిజాయతీ, నిబద్ధతతో పోరాడుతూ శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకలవుతున్నారని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు, రాష్ట్ర విభజన చట్టం అమలు, ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి వంటి అంశాలు చట్టసభల్లో బలంగా వినిపించాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీల ద్వారానే సాధ్యమన్నారు. 250కు పైగా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా ఉత్తరాంధ్ర శాసన మండలికి పోటీ చేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు భవిరి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, కూన వెంకటరావు, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

రమాప్రభ విస్తృత ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పొందూరు, జి.సిగడాం, రణస్థలం మండలాల్లో పలుచోట్ల మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. కాశీబుగ్గలోని ఒక కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొందూరు సన్న ఖాదీని ప్రోత్సహించి, సబ్సిడీ, మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. పైడిభీమవరంలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి, ఫార్మా, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి పాటుపడతానని తెలిపారు. సిపిఎస్ రద్దు, ఒపిఎస్ సాధన కోసం పనిచేస్తానని చెప్పారు. శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల బలం పెరిగితే పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ప్రజల ప్రయోజనాలను రక్షించుకోగలమని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, వెలమల రమణ, విశాఖ స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు కూన.వెంకటరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్, ప్రజాసంఘాల నాయకులు కె.మోహనరావు, ఎన్.గణపతి, సిహెచ్.వేణుగోపాల్, ఎల్.వి చలం, బి.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

మొత్తం 29,575 మంది హాజరు కానున్నారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్లను తహశీల్దార్ల ఆధ్వర్యాన వేస్తున్నట్లు వివరించారు. ప్రశ్నాపత్రాలు డిఆర్‌ఒ కస్టోడియంలో ఉంటాయన్నారు. పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా ఉండేలా చూడాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్ పూర్తయ్యే వరకు స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద తాగునీటి సరఫరా ఉండాలని, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని చెప్పారు. పరీక్షా సమయాల్లో విద్యార్థులకు ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలు నో మొబైల్ జోన్‌గా పరిగణిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ అలీఖాన్, ఆర్‌టిసి ఆర్ఎం ఎ.విజయకుమార్, విద్యుత్ శాఖ ఎస్ఇ, డిప్యూటీ డిఇఒలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

సమాజాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్


పొందూరు : మహిళా శక్తిని తెలుపుతూ విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వివిధ రంగాల్లో పురుషుల కంటే మహిళలే బలంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తున్నారని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్ లో ఐసిడిఎస్, డిఆర్‌డిఎ సంయుక్తంగా మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రతిఒక్కరూ చదువుకోవాలన్నారు. డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి మాట్లాడుతూ మహిళలు ఎంతో సహనం కలిగి ఉంటారని పేర్కొన్నారు. డిఇఒ జి.పగడాలమ్మ మాట్లాడుతూ పాఠశాలల్లో మహిళలదే పై చేయి ఉందన్నారు. మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ పీడీ కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ మహిళలు అసంఘటిత మహిళా కార్మిక శక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఒ లక్ష్మీప్రసన్న, ఉప కలెక్టర్ సవరమ్మ, జిల్లా మహిళాధ్యక్షులు కృష్ణవేణి, డిఎస్‌డిఒ మాధురీలత, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావుత పాల్గొన్నారు. అనంతరం సిడిపిఒలకు ప్రసంసా పత్రాలు అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన అంగన్వాడీ కార్యకర్తలకు బహుమతులను అందజేశారు.

అలాగే శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ), శ్రీప్రగతి మహిళా మండలి (కుటుంబ సలహా కేంద్రం) ఆధ్వర్యాన ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో 'వ్యక్తిత్వ వికాసం- మహిళ' అనే అంశంపై వక్తలు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ శ్రీదేవి, ఆ సంస్థల అధ్యక్షులు పైడి రజని, కోట సావిత్రమ్మ, వికాస తరంగణి జిల్లా కన్వీనర్ ఎం.ఉషశ్రీ, స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ పైడి స్వర్ణలత, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, ఎస్ఐ ఎం.ప్రవల్లిక, ఎపిడబ్ల్యుజెఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మహిళల చదువుతోనే సాధికారత సాధ్యం : ఎస్‌పి

ఎచ్చెర్ల : మహిళలు చదువుతోనే సాధికారత సాధ్యమని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. మండలం చిలకపాలెం శివాని గ్రూప్ ఆఫ్ కాలేజెస్ ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే మహిళలు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో యాజమాన్యం ప్రతినిధులు వి.ఎం.ఎం.సాయినాథ్‌రెడ్డి, కె.దుర్గాశ్రీనివాస్, పి.దుర్గాప్రసాదరాజు, డాక్టర్ దానేటి శ్రీధర్, జామి హరీష్, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్.చంద్రశేఖర్, కె.మధుకుమార్, టి.బాలాజీ పాల్గొన్నారు.

అక్కులపేట సిసికి సన్మానం

ఆమదాలవలస : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఉద్యోగుల్లో అక్కులపేట క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మడపాన సుభద్రకు గౌరవం దక్కింది. ఈ మేరకు జిల్లాలోని బాపూజీ కళామందిర్‌లో జిల్లా సమాఖ్య ప్రాజెక్టు డైరెక్టర్ సమక్షంలో కలెక్టర్ ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ముగ్గుల పోటీలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో నిర్వహించిన ముగ్గులు, పాటలు, మ్యూజికల్ చైర్స్ పోటీలను మండల మహిళా సమైక్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన కార్యాలయం వద్ద నిర్వహించారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ, అనంతరం బహుమతులు అందజేయనున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మా రావు తెలిపారు.

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయితీ గూనానపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గురుగుబిల్లి మధుబాబు ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్త్రీ పాత్రను విద్యార్థులకు తెలియజేస్తూ నేటి సమాజంలో స్త్రీ వివిధ రంగాల్లో ఏ విధంగా అభివృద్ధి సాధిస్తుందో తెలియజేశారు. అనంతరం చిన్నారులు వేసిన వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.వి.రమణ, చుక్కలు తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక వెలుగు కార్యాలయంలో మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు గ్రీష్మ, చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు హేమంతలక్ష్మి, మెళియాపుట్టి సచివాలయం మహిళా పోలీసు భారతి, ఎపిఎం లలితలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

శ్రీకాకుళం : నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పి.స్వర్ణలత, బి.గౌతమి పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, సిఇఒలు కిరణ్‌మజూంధర్, పి.నాయర్ పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

ఇచ్ఛాపురం: పురుషులతో పాటు సమానంగా మహిళలకు అన్ని అవకాశాలు వస్తున్నాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్‌పాడి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళల అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం సుశాంత్ జెన్నా, కన్వీనర్ సీతమ్మ, గణపతి, సంతోషకుమార్, దుర్యోధన, నాగేశ్వరరావు, లోకేశ్, నాగరాజు, వరప్రసాద్ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



బహుమతిని అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్


ఇచ్ఛాపురం : బహుమతులు అందిస్తున్న రాబిన్ కుమార్ పాడి

ఉద్యమాలతోనే మహిళా హక్కుల సాధన

ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి

శ్రీకాకుళం: ఉద్యమాలతోనే మహిళల హక్కులు సాధించుకోగలమని, ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలంతా సంఘటితం కావాలని ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని వాంబే కాలనీ, దమ్మలవీధిలో మహిళలతో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవనిలో సగం ఆకాశంలో సగంగా ఉన్న మహిళలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు మాత్రం అరకొరకగా ఉన్నాయని అన్నారు. మహిళల శ్రమకు తగిన వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో గోవులకు దొరుకుతున్న రక్షణ మహిళలకు దొరకడం లేదని, మనువాద పాలకుల పాలనలో మహిళలపై మరింత దాడులు, హింస చెలరేగిందని అన్నారు. వీటిని అరికట్టాల్సిన పాలకులు చోద్యం చూస్తున్నారని పేర్కొన్నారు. గురజాడ చెప్పినట్లు ఆధునిక స్త్రీ చరిత్రని తిరగరాస్తున్న మరో వైపు రెండో తరగతి పౌరురాలుగా మిగలడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జానకి, డి.సూర్యుడమ్మ, సూరమ్మ, పద్మ, షకీరా పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

ఆస్పత్రిలో శిశువు మృతి

పలాస : పలాస ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం... మండలంలోని ఉదయపురానికి చెందిన విజయకు పురిటినొప్పులు రావడంతో సోమవారం రాత్రి ఆమె భర్త సురేష్ పలాస ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న నర్సులు అశ్విని, హైమా ప్రాథమిక చికిత్స అందించారు. సెలవులో ఉన్న గైనకాలజిస్టు మౌనికకు సమాచారం అందించారు. విజయకు నొప్పులు ఎక్కువ కావడంతో, ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కాశీబుగ్గలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే కడుపులో బిడ్డ చనిపోయిందని వైద్యులు చెప్పారు. ఈ ఘటనను ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కాశీబుగ్గ ఎస్ఐ రమేష్ మంగళవారం ఆస్పత్రి వద్దకు వెళ్లి వైద్య సిబ్బందిని, సురేష్‌ను విచారించారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరిటెండెండెంట్ సిహెచ్.చిన్నంనాయుడును వివరణ కోరగా, విజయ గర్భిణిగా ఉన్న సమయం లో తమ ఆస్పత్రిలో చూపించుకోలేదని చెప్పారు. పురిటినొప్పులు ఎక్కువ వస్తున్న సమయంలో ఆస్పత్రికి తీసుకొచ్చారని, ఆరోజు ప్రసూతి వైద్యులు సెలవులో ఉన్నారని తెలిపారు. ఆస్పత్రిలో మత్తు వైద్యులు పూర్తిగా లేరని చెప్పారు. అయినా వైద్య సిబ్బంది సేవలందించారన్నారు. వైద్యం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయలేదన్నారు.


మృతి చెందిన బిడ్డతో సురేష్

పెట్టుబడులకు రాష్ట్రం చిరునామా

శ్రీకాకుళం: నూతన పెట్టుబడులకు రాష్ట్రం చిరునామాగా నిలిచిపోనుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక పెద్దపాడు లోని క్యాంపు కార్యాలయంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. సమావేశానికి వచ్చిన దిగ్గజ పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ విధానాలు చూశారని, నిజాయతీని గుర్తించారని తెలిపారు. ఇక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు చూసిన తర్వాత రూ.13 లక్షల కోట్ల ఎంఒయులు చేసుకున్నారని వివరించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ సారథిగా జగన్ సాధించిన విజయమన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గార ఎంపిపి గొండు రఘురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.తాతబాబు, వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, నగర కన్వీనర్ వైకుంఠం, అరసవల్లి ట్రస్ట్ బోర్డు సభ్యుడు మండవల్లి రవి, చల్లా రవికుమార్, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

ఉద్యోగులకు జగన్ అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సిపిఎస్‌ను రద్దు చేస్తానని ఎన్నికల్లో హామీనిచ్చి అధికారంలోకొచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేశారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై పోరాడుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై సిఎం జగన్ అణచివేత వైఖరిని అవలంభిస్తున్నారని తెలిపారు. విద్వేషం, విధ్వంసం ఇదే జగన్ ప్రభుత్వ పాలన అని విమర్శించారు. అధికారంలోకొస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకొస్తానని చెప్పి కేసుల నుంచి బయటపడేందుకు మోడీ కాళ్ల ముందు మోకరిల్లారని దుయ్యబట్టారు. మెగా డిఎస్‌సి అని చెప్పిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలో 12వేల పాఠశాలలను మూసివేశారని చెప్పారు. సిపిఎస్‌ను రద్దు చేస్తానని హామీనిచ్చి మాట మార్చారని విమర్శించారు. సచివాలయ ఉద్యోగులకు పిఆర్‌సి వర్తించకూడదన్న కుట్రతో ప్రొబేషన్ పూర్తయినా రెగ్యులర్ చేయకుండా కాలయాపన చేసి, మళ్లీ పరీక్షలంటూ అడ్డగోలు నిబంధనలు పెట్టారని విమర్శించారు. జగన్ అసలు నైజం బయటపడిందని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే అధికార పార్టీ అభ్యర్థులను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నాయకులు వెంకన్న యాదవ్, విభూది సూరిబాబు, సింతు సుధాకర్, ప్రదాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

సహనం మహిళకే సొంతం



డిఎంహెచ్ఒ డాక్టర్ బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సమాజంలో మహిళలపై ఇప్పటికీ వివక్ష కొనసాగడం విచారకరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా మహిళలపై వివక్ష, బాలికలు విద్య, ఉద్యోగాలు చేస్తూ ఇంటి బాధ్యతలను మోస్తున్న మహిళలు, వారు పడుతున్న ఇబ్బందులపై ప్రజాశక్తితో మాట్లాడారు. మహిళలపై వివక్ష ఆడబిడ్డ పుట్టక నుంచే ఇది మొదలవుతోంది జిల్లాలో వయోజనుల విషయంలో లింగ నిష్పత్తి కొంత వరకు బాగానే ఉన్నా సున్నా నుంచి ఆరేళ్ల మధ్య ఉన్న పిల్లలకు సంబంధించిన సెక్స్ రేషియో చాలా తక్కువగా ఉంది. వయోజనుల్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు 1016 మంది మహిళలు ఉండగా చిన్నారుల్లో ప్రతి వెయ్యి మంది మగ బిడ్డలకు 953 మందే ఉన్నారు. 1990-91 తర్వాత వచ్చిన స్కానింగ్ సిస్టమ్‌ను పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అనే విషయం తెలుసుకోవడానికి జనం ఉత్సాహం చూపడం మొదలుపెట్టారు. వాటిని నియంత్రించడానికే 1994 గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షల చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అనే తెలుసుకోవడంలో తల్లే ఎక్కువ ఉత్సాహం చూపిస్తుండటం విచారకరం. ఆడ బిడ్డయితే భర్త, అత్తా మామల నుంచి ఎదురవుతున్న వేధింపులే కారణం కావొచ్చు. ఆడ, మగా అనే తేడా లేకుండా ఇద్దరినీ సమానంగా చూసే తత్వాన్ని తల్లిదండ్రులు ఏర్పర్చుకోవాలి. తల్లిదండ్రుల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరముంది. సమాజంలో కూడా ఆ రకమైన మార్పు వచ్చినప్పుడే అది సాధ్యపడుతుంది. ఆడ పిల్లలను నేటికీ తల్లిదండ్రులు ఒక బరువుగా భావిస్తున్నారు. యుక్త వయస్సు రాకుండానే పెళ్లిలు చేసేసి బాధ్యత అయిపోయినట్లుగా అనుకుంటున్నారు. అర్బన్ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల కేసులు ఎక్కువగా నమోదు కావడం మనం చూస్తున్నాం. ఇది సరికాదు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలకు సమాన అవకాశాలు కల్పించాలి. ఉన్నత చదువులు చదివేలా వారిని ప్రోత్సహించాలి.


సహనం మహిళలకే సొంతం

ఓర్పు, సహనం విషయంలో మహిళలకు ఎవరూ సాటిరారు. కొన్ని రకాల విధులను వారు మాత్రమే నిర్వర్తించగలరు. వైద్య ఆరోగ్యశాఖలో ఎఎన్ఎం పోస్టుల్లో అధికశాతం మంది మహిళలు ఉండటానికి కారణం వారు సహనంతో సేవలందిస్తారని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం నియమిస్తోంది. అదేవిధంగా ఆశా వర్కర్లు కూడా ఓర్పుతో సేవలు అందిస్తున్నారు. సహనం, నేర్పుగా కస్టమర్లను ఒప్పించగలరనే వ్యాపార, వాణిజ్య దుకాణాల్లో ఎక్కువ మంది సేల్స్ గర్ల్స్‌ను నియమిస్తుంటారు

నిర్ణయాల్లో మహిళలకు భాగస్వామ్యం అవసరం

కుటుంబంలో కూడా మహిళలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరముంది. ఏదైనా అంశంపై నిర్ణయాలు చేసే సమయంలో చాలా కుటుంబాల్లో వారికి భాగస్వామ్యం కల్పించడం లేదు. మహిళలకూ అవకాశం కల్పిస్తే మగవాళ్ల కన్నా మెరుగైన ఆలోచలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. ప్రస్తుతం పెరుగుతున్న ఖర్చులు అవసరాలు దృష్ట్యా మహిళలు కూడా పని చేస్తున్నారు. కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో వారి పాత్రను విస్మరించడానికి వీల్లేదు. ఉద్యోగం చేస్తున్న మహిళలైతే కార్యాలయంలో ఓ పక్క విధులు నిర్వహిస్తూనే మరోవైపు గృహిణిగా బాధ్యతలు చూస్తున్నారు. తన పిల్లల సంరక్షణతో పాటు భర్త, ఇతర కుటుంబ సభ్యుల ఆలనాపాలన విషయాలను ఎంతో సహనంతో చూస్తున్నారు. ఎంతటి ఒత్తిడినైనా సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తి మహిళలకు మాత్రమే ఉంది. పురుషులతో పాటు మహిళలకూ సమాన ప్రాధాన్యమిచ్చినప్పుడే ఆ సమాజం మరింత ముందుకు పురోగమిస్తుంది.

'స్త్రీ లేకపోతే జననం లేదు. స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే సృష్టే లేదు' 1908 సంవత్సరం మార్చి 8వ తేదీన అమెరికాలో మహిళలు తమకు ఉద్యోగాలలో సమాన అవకాశాలు, వేతనలు కావాలన్న డిమాండ్‌తో భారీ నిరసన చేపట్టారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఈ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని మహిళలు అభిప్రాయాల మాలిక.



మహిళలు మహారాణులు

స్వశక్తిపై జీవించాలి



మహిళలు తన సంపాదనపై తాను జీవించాలని నిర్ణయించుకోవాలి. విద్యార్థిని తల్లిదండ్రులు అమ్మాయిలను పై చదువులు చదివించాలి. తద్వారా అమ్మాయికి స్వశక్తిపై జీవించే అవకాశం వస్తే మహిళగా గుర్తింపు పొందుతారు. కానీ చదువుకునేటప్పుడే అమ్మాయిని తక్కువ చేసి కొంతమంది తల్లిదండ్రులు అబ్బాయికి పై చదువులు చదివిస్తున్నారు. ఈ వ్యత్యాసం పోవాలి. మహిళకు ముఖ్యంగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రస్తుతం మహిళ అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు. ఇంకా అభివృద్ధి చెందిన నాడే కుటుంబ వ్యవస్థ బాగుపడుతుంది.

- జి.గ్రేస్., ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్ల జిల్లా కో-ఆర్డినేటర్

మహిళల స్థితిగతుల్లో మార్పు లేదు



మహిళా దినోత్సవం ప్రతి ఏటా నిర్వహిస్తున్నా వారి స్థితిగతుల్లో మార్పు రాలేదు. మహిళలు అన్ని రంగాల్లోనూ వారి స్వశక్తితో ఎదుగుతున్నారు తప్ప, వారికి ఎటువంటి ప్రోత్సాహం లేదు. హింస, అత్యాచారాలు, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు ఇంకా ఎక్కువయ్యాయి. ఎన్ని చట్టాలు వచ్చినా అందులో మార్పులేదు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా మహిళలకు చేసిందేమీ లేదు. బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు మహిళలను కించపరుస్తూ మాట్లాడుతున్నారు. వారిని కని, పెంచింది కూడా మహిళే అన్న విషయం మరిచిపోతున్నారు. చిన్న పిల్లలపై కూడా అత్యాచారాలు జరుగుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కావడం లేదు. సమాన పనికి సమాన వేతనం లేదు. చదువులో వెనుకబాటు ఉంది. ఏదో మహిళా దినోత్సవం సందర్భంగా వారిని ఉద్ధరిస్తున్నట్లు చెప్పే కంటే.. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కలించాలి.

- కె.నాగమణి, జిల్లా కన్వీనర్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ

పురుషులతో సమానంగా మహిళలు



గృహిణిగా తన బాధ్యతలతో పాటు సమాజంలో వివిధ పాత్రలు పోషిస్తున్న నా తోటి మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. మహిళగా పుట్టినందుకు గర్విద్దాం. భర్తను కోల్పోయిన వారు ఒంటరి మహిళలుగా భావించి నాటి సిఎం చంద్రబాబుతో మాట్లాడి, ఒంటరి మహిళా పింఛను ఇప్పించాను. ఇది ఓ మహిళగా నాకు సంతృప్తినిచ్చింది. సమాజంలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు, చులకనగా చూడటం పెరిగింది. వారు మాట్లాడేటప్పుడు వారింట్లోనూ ఓ మహిళ ఉందని గుర్తిస్తే ఇటువంటివి ఉండవు. మహిళ వంట చేసేదిగా, పని మనిషిగా కాకుండా పురుషులతో సమానంగా చూడాలి. మహిళలపై వేధింపులు పెరిగాయి. మహిళ తన హక్కుల కోసం పోరాడాలి.

-గౌతు శిరీష, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆత్మరక్షణ అవసరం



మహిళలు తమ ఆత్మరక్షణ కోసం దిశ యాప్‌ను ఉపయోగించుకోవాలి. భరతనాట్యం, క్లాసికల్ డాన్స్ ఎలా నేర్చుకుంటున్నారో ఆత్మ రక్షణ కోసం కరాటే, కుంగ్ ఫూలో శిక్షణ తీసుకోవాలి. విద్యార్థులు సోషల్ మీడియాకు ఆకర్షితులు అవ్వకుండా జాగ్రత్త పడాలన్నారు. వాటిపై తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులు ఒత్తిడికి గురై సూసైడ్ ఎక్కువ మంది చేసుకుంటున్నారు, స్కూల్స్, కాలేజీల్లో సైకాలజీ క్లాసులు నిర్వహించడం అవసరం. ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోవాలి. తద్వారా ఒత్తిడిని జయించవచ్చు.

- డాక్టర్ చంద్రకళా మల్లేశ్వర్, సైకాలజిస్ట్

చట్టాలపై అవగాహన అవసరం

మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాల్లో వస్తున్న మార్పులపై అవగాహన అవసరం. చట్టాలపై అవగాహన ఉన్నా బంధాలు, అనుబంధాల మధ్య ఇరుక్కుపోవడంతో ఆ చట్టాలు దుర్వినియోగం అవుతున్నాయి. బాల్యవివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన అవసరం. సామాన్యులు, పేద మహిళలు ఉచిత న్యాయ సహాయాన్ని కోర్టుల ద్వారా పొందవచ్చు.

- టి.హరిత, టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి

మహిళలకు సముచిత స్థానం



ముఖ్యమంత్రి జగన్ మహిళలకు సముచిత స్థానం ఇచ్చారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించడంలో జగనన్నకు సాటిలేరు. మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తోంది. దిశ చట్టం రక్షణ కవచంగా నిలుస్తోంది. గత ప్రభుత్వంలో మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, లైంగిక దాడులు ఎన్నో జరిగాయి. అటువంటివి ప్రస్తుతం దిశ చట్టం, యాప్ కారణంగా చాలావరకు తగ్గాయి.

- చింతాడ మంజు, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు

చదువులో ముందుండాలి



మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలంటే ముందుగా చదువులో ముందుండాలి. చదువుకున్న ప్రతి మహిళా అన్ని రంగాల్లోనూ ముందు వరుసలో ఉంటోంది. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. ప్రతి కుటుంబమూ విద్యపరంగా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంట్లో ఉన్న స్త్రీ విద్యావంతురాలై ఉండాలి. తల్లిదండ్రులు అమ్మాయిలకు చదువెందుకు అనే ధోరణి వీడాలి. అబ్బాయితో సమానంగా చదివిస్తే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు.

- ఎం.కృష్ణవేణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీకాకుళం

అన్ని రంగాల్లోనూ మహిళలు ముందంజ



మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి. వచ్చిన అవకాశాలు అందిపుచ్చుకొని ముందడుగు వేయాలి. మహిళలు చదువులో రాణించి లక్ష్యం సాధించుకోవాలి. రాజకీయాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. మహిళల రక్షణకు సిఎం జగన్ దిశ యాప్‌ను రూపొందించారు. మహిళల కోసం అమ్మఒడి, జగనన్న ఆసరా, జగనన్న చేయూత, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, మహిళల పేరుతో ఇళ్ల పట్టాల పంపిణీ, స్థానిక సంస్థల్లో 50 శాతం మహిళలకు అవకాశాలు కల్పించిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుంది.

- దువ్వాడ వాణి, జెడ్‌పిటిసి, టెక్కలి

మహిళలు రాణించాలి



అన్ని రంగాలలో మహిళలు రాణించాలి. చదువుకున్న రోజుల్లోనే ఆ ప్రణాళికతో చదువుకోవాలి. మహిళలు తమ ఉనికిని చాటుకునే విధంగా ప్రతి రంగంలోనూ ముందుకు వెళ్లాలి. గృహిణీ గృహానికే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలుసుకొని తన కాళ్లపై తాను నిలబడేలా ఉండాలి. మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలపై దిశా యాప్‌ను ఉపయోగించుకుని రక్షణ పొందాలి. మహిళల ఉద్ధరణకు సిఎం జగన్ కృషి చేస్తున్నారు.

- ఉలాల భారతీ దివ్య, వైస్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం మున్సిపాల్టీ

పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి



ప్రతి మహిళా పౌష్టికాహార లోపాన్ని అధిగమించిననాడే ఆరోగ్యంగా ఉంటారు. 14ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ఎక్కువ మంది మహిళలు రక్తహీనతకు లోనవుతున్నారు. దీనివల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పిల్లలకు ఆహారం పెట్టి వారు తీసుకోకపోవడం లేదు. మహిళలు ఉద్యోగాలు, ఇంటి పనుల వల్ల విశ్రాంతి తీసుకోలేకపోవడమూ ఓ కారణం. నేటి మహిళ అన్ని రంగాల్లోనూ ముందుండాలి.

- కె.అనంతలక్ష్మి, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఐసిడిఎస్

మహిళలకు ఉపాధి అవకాశాలు



అన్ని రంగాల్లోనూ స్త్రీలు రాణించాలనే ఉద్దేశంతో శాసన, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకే సిఎం జగన్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రాజకీయాల్లోనూ, ఉద్యోగాల్లోనూ వైసిపి ప్రభుత్వ హయాంలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తున్నారు. మెప్మా ద్వారా మహిళలకు జగనన్న తోడు, చేయూత, లింకేజీ రుణాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. మహిళా పోలీసులు ద్వారా మహిళల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

- దివ్వెల మాధురి, వైసిపి మహిళా విభాగం టెక్కలి మండల అధ్యక్షులు

సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి



విద్యార్థినులు కౌమర దశలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. ఎక్కువగా సోషల్ మీడియాలో వచ్చే చెడు విషయాలకు వీరు ఆకర్షితులు అవుతున్నారు. వీటికి దూరంగా ఉంచాల్సిన బాధ్యత ముఖ్యంగా తల్లిదండ్రులపై ఉంది. మహిళలు చదువులో ముందుంటే అన్ని రంగాల్లోనూ ముందు ఉండొచ్చు. ఇప్పటికే మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారు.

- ఆర్.విజయలక్ష్మి, ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం, శ్రీకాకుళం

మూగ జీవాల మౌనభాష వింటూ..

ప్రజాశక్తి - కవిటి

చిన్నప్పటి నుంచీ మూగజీవాలను గమనిస్తూ, వాటిని దగ్గర నుంచి పరిశీలిస్తూ పెరిగిన బిడ్డిక శిరీష పెద్దయ్యాక పశువైద్యురాలిగా స్థిరపడ్డారు. సీతంపేట మండలం ధోనుబాయి గ్రామంలో జన్మించిన శిరీష తండ్రి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు. తల్లి గృహిణి. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన శిరీషకు మొదటి నుంచీ క్రమశిక్షణ, అంకితభావం మెండుగా ఉండేవి. 2016లో ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామంలో పశు వైద్యురాలుగా ఉద్యోగం వచ్చినా వెనుకంజ వేయకుండా బాధ్యతలు చేపట్టిన శిరీష నేటికీ అదే స్ఫూర్తితో తన వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కవిటి, ఈదుపురం, ఎంఎస్ పల్లి తదితర ప్రాంతాల ప్రజలు, వ్యవస్థల నుంచి తన వృత్తి జీవితంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని ఆమె తెలిపారు. చిన్న వయసులోనే పెద్ద బాధ్యతలు చేపట్టి అటు అధికారులు, ఇటు స్థానికుల నుంచి శభాష్ అనిపించుకుంటున్న డా శిరీష నుంచి తాము చాలా విషయాలు నేర్చుకున్నామని ఆమె సహచరులు, కింద పనిచేసే ఉద్యోగులు చెబుతుంటారు. వృత్తిపై ఆమెకు ఉన్న నిబద్ధత, అంకితభావాన్ని గుర్తిస్తూ అప్పటి ఉప ముఖ్యమంత్రి కృష్ణదాస్ ఉత్తమ పశు వైద్యాధికారిగా అవార్డు అందుకున్నారు శిరీష. అంతేకాకుండా తన వత్తి జీవితంలో పలు అవార్డులు, రివార్డులు అందుకున్న శిరీష ఏడాది బాబుతో అటు కుటుంబ బాధ్యతలు ఇటు ఉద్యోగ బాధ్యతలు ఏక కాలంలో నిర్వర్తిస్తూ మరింత మంది మహిళలకు ఆదర్శనీయురాలని చెప్పడంలో సందేహం లేదు.



పశు వైద్యసేవలు అందిస్తున్న శిరీష

వారసత్వ సంపద చిహ్నాలను గుర్తిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వారసత్వ సంపద చిహ్నాలను గుర్తిద్దామని ఇంటాక్ కన్వీనర్ నూక సన్యాసిరావు అన్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో ఇంటాక్ కార్యనిర్వాహకవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇంటాక్‌లో సభ్యత్వాలను పెంచాలని సమావేశంలో సభ్యులు అభిప్రాయపడ్డారు. జిల్లాలో చరిత్ర ప్రసిద్ధి చెందిన మెట్ల బావులు రెండు ఉన్నాయని, వాటిని స్వచ్ఛంద సంస్థల సహకారంతో పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సభ్యులు సూచించారు. ఈ నెల 23న జిల్లాలో కార్యనిర్వాహకవర్గ సభ్యులతో కొన్ని చారిత్రక ప్రదేశాల ప్రత్యేక సందర్శన చేపడుతున్నట్లు తెలిపారు. మరుగున పడిపోతున్న శిలాశాసనాలను, శిథిల చారిత్రక కట్టడాల పరిరక్షణకు కృషి చేపట్టాలన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం కళ్లేపల్లిలో ఒక శిథిల కోట ఉన్నట్లుగా గుర్తించామని, వివరాలు సేకరిస్తున్నామని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, జగన్నాథనాయుడు, మోహన్, రాధాప్రసాద్, సురంగి మోహనరావు, కొమ్ము రమణమూర్తి, కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్ (హరికా ప్రసాద్) పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సభ్యులు



మాట్లాడుతున్న నారాయణరావు

క్లబ్‌లతో పర్యాటకానికి కొత్తరూపు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, టూరిజం క్లబ్‌లో పర్యాటకానికి కొత్తరూపు వస్తుందని జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణరావు అన్నారు. నగరంలోని ఠాగూర్ స్కూల్‌లో యువ టూరిజం క్లబ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అనేక విద్యా సంస్థలు యువ క్లబ్‌లు ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని అనారు. జిల్లా విద్యాశాఖ సహకారంతో అన్ని ఉన్నత పాఠశాలల్లో యువ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు మాట్లాడుతూ సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షించడానికి పర్యాటక ప్రదేశాలు అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ మేనేజర్ వి.అప్పలనాయుడు, ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రజ్ఞా వికాస పరీక్ష

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిత్తిరి రాజు ఆధ్వర్యాన విద్యార్థులకు మంగళవారం ప్రజ్ఞా వికాస పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించడంతో పాటు సమాజంపై అవగాహన కలిగే విధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన స్టడీ సర్కిల్, తరగతులను నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై నెలకొన్న భయాందోళనలను పోగొట్టేందుకు ఇలాంటి పరీక్షలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు గణేష్, సంధ్య పాల్గొన్నారు.

'ఎన్ఇఆర్'కు అభినందనలు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న త్రినాధరావు, సురేష్

నైతిక విలువలతో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థగా విద్యార్థుల చక్కని భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉత్తరాంధ్రకే ఉత్తమ విద్యా సంస్థగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థను స్థాపించారని అన్నారు. 11,12 తరగతులకు సిబిఎస్ఇ అనుమతి పొంది విద్యార్థుల చక్కని భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్), స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజల దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లావేరు మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, సీనియర్ జర్నలిస్టు కొన్ని వెంకటరావు, ఎంఇఒ అజ్జాడ త్రినాధరావు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

టెక్కలి: మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన బడబందల భూపతి కుమార్తె విజయ వివాహానికి టెక్కలి అక్షర ఫౌండేషన్ నుంచి రూ.10వేలు ఆర్థికసాయం అందించినట్లు ట్రస్టు చైర్మన్ బొడ్డేపల్లి నేతాజీ తెలిపారు. మంగళవారం భూపతికి పై మొత్తం అందించినట్లు చెప్పారు. కష్టకాలంలో తమను ఆదుకున్న అక్షర ఫౌండేషన్‌కు కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పిఎల్ఐ ఏజెంట్ల నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తపాలా శాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో ఫీల్డ్ ఆఫీసర్లు, తపాలా ఏజెంట్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు పోస్టుమాస్టర్ జనరల్ నాగాదిత్య కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం రీజియన్‌లో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా సేవలను ప్రజలకు అందించేందుకు ఫీల్డ్ ఆఫీసర్లను, డైరెక్ట్ ఏజెంట్లను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ ఆఫీసర్లుగా పనిచేయడానికి విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు అర్హులని, డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేసేందుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులై ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. వీరు వారికి కేటాయించిన ప్రాంతాల్లో జీవిత బీమా మార్కెటింగ్, కస్టమర్ సేవలు అందించాల్సి ఉంటుందని అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11 లోగా తమ దరఖాస్తులను పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం రీజియన్‌కు పంపించాలన్నారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలకు 9441865857, 0891-2546204 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహిళా చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న సరళకుమారి

ప్రజాశక్తి- సోంపేట

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాము, జాతీయ మహిళా కమిషన్ రిసోర్స్‌పర్సన్ సరళకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఆశా కార్యకర్తలకు, మహిళా సంఘ సభ్యులకు మహిళా చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహహింస, వివాహ రిజిస్ట్రేషన్, లైంగిక వేధింపులు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలంతా చట్టాలు తమకు కల్పిస్తున్న రక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

డ్రోన్ల తయారీపై 'ఐతమ్'లో వర్క్‌షాపు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఆధునాతన డ్రోన్ల నిర్మాణం డిజైన్‌పై ఐతమ్ మూడు రోజుల వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. యాస్పైర్-2023లో భాగంగా ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్న పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పంజాబ్, ఎల్పీ యూనివర్సిటీ నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. వర్క్‌షాపు అనంతరం వారు తయారు చేసిన డ్రోన్లను ప్రదర్శిస్తారని చెప్పారు. ఉత్తమ ప్రదర్శనకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. వర్క్‌షాపు రిసోర్స్‌పర్సన్‌గా ఎంవిజిఆర్ నుంచి సి.హెచ్.భవానీశంకర్, ఎన్.గురుమూర్తి, సిటిఇ ఆశ్రమ టెక్నాలజీస్ వ్యవహరిస్తుండగా, కో-ఆర్డినేటర్లుగా డి.రఘువీర్, ఎ.సతీష్‌కుమార్, డి.ఖానచంద్ర, మున్సైర్ కో-ఆర్డినేటర్లుగా ప్రసన్న, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


డ్రోన్‌ను తయారు చేస్తున్న విద్యార్థులు

పుస్తకాల పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న డాక్టర్ సురేష్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ ఎంపీ, కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు జయంత్యుత్సవాల్లో భాగంగా పురపాలక సంఘంలోని ఆరో వార్డు పరిధిలో ఉన్న తెలగ మన్యయ్యపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శ్రీకాకుళానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ విద్యార్థులకు పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజగోపాలరావు జయంత్యుత్సవాల్లో తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ఆయనను నిరంతరం స్మరిస్తూ యువత ఆదర్శప్రాయంగా తీసుకోవాలని, జిల్లా అభివృద్ధికి భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ పేడాడ రాంబాబు రాజగోపాలరావు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, గ్రామ పెద్దలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కోటబొమ్మాళి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హరిశ్చంద్రపురం గ్రామంలో కొత్తమ్మతల్లి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యపరీక్షలు చేయనున్నామని, దీన్ని వినియోగించుకోవాలని సిఇఒ పూజారి సత్యప్రియ ఒక ప్రకటనలో కోరారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, ఆసక్తిగల వారు రక్తదానం చేయాలని కోరారు.


సన్మానిస్తున్న నాయకులు

విశాఖలో సుధాకర్‌కు సన్మానం

లావేరు : లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంగ్లీషు ఉపాధ్యాయులు సంజీవిని నళిని సుధాకర్‌కు శ్రీలంకలో అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో నడకపోటీల్లో పాల్గొని రజిత పథకాన్ని సాధించారు. దీంతో విశాఖపట్నంలో విశాఖ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వైసిపి నాయకులు కోమటి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, జనసేన నాయకులు ఉంగరాల శ్రీనివాసరావు, భారతదేశ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మంగ వరప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

సిఎంకు కృతజ్ఞతలు

ఆమదాలవలస : వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా నియమించినందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డికి వైసిపి నాయకులు చింతాడ రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. పురపాలక సంఘం పరిధిలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయం లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తనకు అప్పగించిన బాధ్యతను మనస్ఫూర్తిగా నిర్వహించి పార్టీ ప్రతిష్టను పెంచుతానన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో ముమ్మరంగా ఆస్తి పన్ను వసూలు చేపట్టారు. కమిషనరు ఎన్.రమేష్ ఆధ్వర్యాన సిబ్బంది బకాయిదారుల వద్దకు నేరుగా వెళ్లి పన్ను చెల్లించన పక్షంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీకి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ ఆస్తులు రూ.2.77 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.1.58 కోట్లు వసూలైందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ముదు అసైన్‌మెంట్‌లకు సంబంధించి రూ.49 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు స్టేట్ గవర్నమెంట్ ఆస్తులు 35కు రూ.71 లక్షలు రావాల్సి ఉండగా, రూ.లక్ష వసూలైందని అన్నారు. అమర్, సిబ్బంది పాల్గొన్నారు.


పన్నుల వసూలును పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ పరుగులు


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న సాయిరాజ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జగన్ నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామిక అభివృద్ధి చెందటానికి సిద్ధంగా ఉందని వైసిపి ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. విశాఖలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సు విజయవంతంగా పూర్తయినందుకు పట్టణంలోని పురుషోత్తపురంలో మంగళవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సదస్సు వల్ల 6 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. అనంతరం విజయోత్సవ కేకు కట్ చేసి, సంబరాలు చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, తాడి ఆదిరెడ్డి, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు అన్వేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాబురావు, వైసిపి నాయకులు చాట్ల తులసీదాస్‌రెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, ప్రేమ్‌కుమార్, తిరుపతి, రాంజీ, గుజ్జు తారకేసురెడ్డి, పరపతి కోటేశ్వరరావు, దేవరాజు, తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా విశాఖలో ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం 352 ఒప్పందాలతో


రణస్థలం : కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం సిఎం జగన్మోహన్‌రెడ్డి దార్శనికతకు నిదర్శమని కొనియాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, లావేరు, జి.సిగడాం జడ్‌పిటిసిలు మీసాల సీతంనాయుడు, కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రధరుని డోలోత్సవం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలోని శ్రీ చక్రధరుని డోలోత్సవాలు మంగళవారం జన జాతరతో అంగరంగ వైభవంగా ముగిశాయి. జాతర సందర్భంగా వేకువ జాము నుంచే యాత్రికులు క్యూలైన్లలో వేచివుండి మొక్కులు చెల్లించుకున్నారు.ా ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు.


కవిటి : జాతరలో జన సందోహం

మెళియాపుట్టి: స్థానిక రాధాగోవిందస్వామి ఆలయంలో డోలోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆఖరి రోజున గజపతి రాజ వంశస్థులు పాల్గొంటారు. ఏటా హోలీ పండుగ నేపథ్యంలో ఈ డోలోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ.

సర్వే రాళ్లు పంపిణీ

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని ఇప్పటివరకు సర్వే చేసిన గ్రామాలకు సర్వే రాళ్ల పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తహశీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. మండలంలోని నీలకంఠాపురంలో రైతులకు సర్వే రాళ్లపై మంగళవారం అవగాహన కల్పించారు. భూములు రీ సర్వే నిర్వహించిన గ్రామాలకు ప్రభుత్వం సర్వే రాళ్లను అందజేస్తుందన్నారు. మీ భూముల్లో సర్వే నిర్ణయించిన ప్రకారం సర్వే రాళ్లను పాతించుకోవాలని తెలిపారు. నీలకంఠాపురానికి 1093 సర్వే రాళ్లు వచ్చాయని, వాటిని రైతులు భూముల్లో పాతుకునేందుకు ప్రభుత్వం రూ.90 చెల్లిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.


ఎంపిపి, జెడ్‌పిటిసిలను కలిసిన రామారావు

'నర్తు' గెలుపునకు సహకరించాలి

కోటబొమ్మాళి : వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని నర్తు రామారావు ఎంపిటిసిలను కోరారు. మంగళవారం జర్జంగి గ్రామంలో వైసిపి నాయకుడు ఎ.రామారావు ఆధ్వర్యాన ఎంపిపి ఆర్.ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావును కలిశారు. ఈ సందర్భంగా నర్తు మాట్లాడుతూ కోటబొమ్మాళి మండలంలో 11 మంది ఎంపిటిసిలను ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు నర్తు రామారావును సన్మానించారు. కార్యక్రమంలో కళింగ కర్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సీనియర్ నాయకులు పేడాడ వెంకటరావు, ఎంపిటిసిలు బొడ్డు అప్పన్న, హనుమంతు గోవింద్, శ్రీనివాస్‌రెడ్డి, చెంచులు, నంబాళ రాజశేఖర్, బొడ్డు అప్పన్న, పంకు లక్ష్మి, మెండ జగన్, సింగుపురం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్లు వితరణ

పొందూరు : మండలంలోని పిల్లలవలస అంగన్వాడీ కేంద్రానికి భోజనం ప్లేట్లను, గ్లాసులను సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు మంగళవారం వితరణగా అందజేశారు. కేంద్రంలోని సుమారు 20 మంది చిన్నారులకు సరిపడా భోజనం ప్లేట్లు, గ్లాసులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త జి.నాగరత్నం చిన్నారులతో కలిసి సర్పంచ్‌కు కృతజ్ఞతలను తెలిపారు.


భోజనం పేట్లను అందజేస్తున్న సర్పంచ్ పోలినాయుడు

సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు


మామిడికాయలను పరిశీలిస్తున్న భగవాన్

ప్రజాశక్తి - బూర్జ

మామిడి పంటలో వ్యవసాయాధికారుల సూచనలు రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని డాక్టర్ వైఎస్‌ఆర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త బి.వి.కె భగవాన్ అన్నారు. మండలంలోని పెద్దపేట, మదనాపురం గ్రామాల్లో మామిడి రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మామిడి తోటల సస్యరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాన్నారు. ముఖ్యంగా మామిడి పంటకు తేనె మంచి పురుగు వ్యాప్తి చెందుతుందని, దీనివల్ల పువ్వులు పోవడంతో పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. అలాగే కాయ తొలుచు పురుగు, బూడిద తెగులు సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమయంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఈయన వెంట అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వం అందించే టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, డాక్టర్ ప్రజ్ఞ చైతన్య, డాక్టర్ కె.వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని చీపుర్లపాడు, సరియాపల్లి, గంగరాం గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వారు మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్ర జ్వరం వచ్చి 104-106 డిగ్రీలు ఉంటుందని, నోటి నుండి తీగల మాదిరి చొంగ కారడం, నోటిలో, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడటం, తిండి మందగించి నీరసించడం, చిన్న ఎండకు


పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న కిరణ్‌కుమార్

రొప్పడం, చుడి పశువులు ఈసుకుపోవటం, పని సామర్థ్యం తగ్గటం జరుగుతుందని, ఈ వ్యాధి సోకిన తరువాత వైద్యం ఆలస్యం చేస్తే పశువులు చనిపోయి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు కె.ముకుందరావు, తరుణమ్మ, కుటికుప్పల ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న శివాజీ

శివాజీ పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీలోని 30వ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గోరుశెట్టి అమ్మనమ్మ, వార్డు కౌన్సిలర్ డొక్కరి తులసి తండ్రి అగురు కూర్మారావు, కేశుపురం, బోడ్డపాడు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన యర్రయ్య, రెయ్య కృష్ణవేణి కుటుంబాలను గౌతు శ్యామ సుందర శివాజీ మంగళవారం పరామర్శించారు. వారు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, కుత్తుం మాధవిరావు, కిక్కర ఢిల్లేశ్వరరావు, సార జోగారావు, కుమార్‌రాజు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సరుబుజ్జిలి : ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్‌ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. మండలంలోని విజయరాంపురంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి మీ అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదన్నారు. డిజిటల్ పేమెంట్స్ వాటి వల్ల కలిగే లాభాలను రూపే, ఎటిఎం కార్డు వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్ లక్ష్మి, సిఎఫ్‌ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనంతరావు

ఉగాది నాటికి లక్ష్యం పూర్తి

ప్రజాశక్తి- పలాస

జగనన్న గృహ కల్పన పథకంలో బాగంగా ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లక్ష్యాన్ని అధిగమించాలని హౌసింగ్ డిఇఇ ఆర్.అనంతరావు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పలాస ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం సాయంత్రం హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా హౌసింగ్‌కు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నిర్మాణం పూర్తి చేసిన గృహాలకు సకాలంలో బిల్లులు చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఆయనతో పాటు అర్బన్ హౌసింగ్ ఎఇ ధర్మేంద్ర, ఎఇ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నందిగాం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో చేరదలుచుకునేవారు ఈ నెల 24వ తేదీ వరకు 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ బి.దమయంతి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు.


బహుమతులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండల కేంద్రంలో పంచముఖ ఆంజనేయస్వామి 23వ వార్షికోత్సవం సందర్భంగా యువజన సేవా సంఘం సౌజన్యంతో నిర్వహించిన హనుమాన్ చిత్రలేఖనం పోటీల్లో డి.కిశోర్, ఎ.శివ, టి.వర్షిణి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. వీరికి ఆలయ ధర్మకర్త పప్పురాజు, గ్రామ సర్పంచ్ కె.లక్ష్మి, ఎంపిటిసి డి.లక్ష్మి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.వేణుగోపాలరాజు, కె.అప్పారావు, యువజన సంఘం ప్రతినిధులు కూచెట్టి భానుప్రకాష్, అట్టాడ సాయికుమార్, మన్మథ, జి.కె సింహాచలం, కామేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు దుప్పల రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని తలగం నౌపాడ ఆర్ఎస్ జెడ్పి ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలపై భయాన్ని విడనాడాలని కోరారు. ఒత్తిడిని జయిస్తూ మానసిక పరిపక్వత సంపాధించిన నాడు అనుకునే ఆశయానికి విద్యార్థి చేరువవుతాడని ఆయన తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ ముఖ్యంగా అలవడాలని, వినయమే మనలో కొంతవరకు లక్ష్యాన్ని సాధిస్తుందని ఆయన అన్నారు. హెచ్ఎం ధర్మారావు అధ్యక్షతనన నిర్వహించిన సదస్సులో ఉపాధ్యాయులు ఎం. కృష్ణారావు, రామముని రమేష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.







అభినందిస్తున్న నాయకులు

వైసిపి బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా కృష్ణచైతన్య

నరసన్నపేట: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా ధర్మాన కృష్ణ చైతన్యను సిఎం జగన్ నియమించారు. ఈ సందర్భంగా ఆయనను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య విలేకరులతో మాట్లాడారు. జోనల్ ఇన్‌ఛార్జిగా తనను నియమించిన సిఎంకి కృతజ్ఞతలు తెలిపారు. నా తండ్రి కృష్ణదాస్ గతంలో బిసిసెల్ ఇన్‌ఛార్జిగా పని చేశారు. ఆయన అనుభవం నాకు ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు.

విద్యార్థి విభాగానికి పాణికుమార్

రణస్థలం : వైఎస్ఆర్ విద్యార్థి విభాగానికి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు జోనల్ ఇన్‌ఛార్జిగా రణస్థలం మండల కేంద్రానికి చెందిన వడ్డాది పాణికుమార్‌ని ఆ పార్టీ అధిష్టానం నయమిస్తూ... మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి, టిటిడి చైర్మన్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి, విజయసాయిరెడ్డికి, పుష్ప శ్రీవాణికి, ధర్మాన కృష్ణదాస్‌కు, ఎమ్మెల్యే కిరణ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.









ఎంపిటిసి పరామర్శ

బూర్జ : మండలంలోని సింగన్నపాలెంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో సురాపు అప్పమ్మ చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకులు, ఎంపిటిసి విక్రమ్‌దూబ సంగంనాయుడులు బాధితురాలిని పరామర్శించారు. అగ్నిప్రమాదంలో జరిగిన నష్టంపై ఆరా తీశారు. అనంతరం నగదును అందజేశారు. నూతన ఇల్లు నిర్మాణానికి జనసేన నాయకులు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈయన వెంట రుద్రకొల్లి జయరాం, కార్యకర్తలు ఉన్నారు.

జీవామృతం తయారీ

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యాన చెరుకు పంట కోసం మండల యాంకర్ నక్క చిరంజీవిరావు ఆధ్వర్యాన రైతులు మంగళవారం జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో జీవామృతం పంటలకు అవసరమన్నారు. ఇది పంటలకు ఉపయోగించడంతో పంటలకు అవసరమైన నేలలోని కోటానకోట్ల సూక్ష్మజీవులను అభివృద్ధి చెంది పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, తిరుపతిరావు, మల్లేష్, జానకిరామ్, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

